www.sphoortipatrika.com APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక
Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి,
వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో
పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు
మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక :16 | పేజీలు : 04 వెల రూ. 2/- | సోమవారం 16-03-2026
PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 16 | PAGES : 04 PRICE : 2 | MONDAY, 16 MARCH 2026
Kurnool Edition | Covering Andhra Pradesh & Telangana |

## గ్రామీణ మహిళలు ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ సృష్టికర్తలు కావాలి : మంత్రి సీతక్క

భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ మార్పు సాధ్యమైంది ఆదివాసీ కుటుంబం నుంచి ప్రజాసేవలోకి..



హైదరాబాద్: బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు నా జీవితం ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశాల ఫలితమని మంత్రి సీతక్క అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ మార్పు సాధ్యమైందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తెలంగాణ వార్తలు దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన

## మాట ఇచ్చాం.. పనులు చేస్తాం.. గిరిజనులకు పవన్ కల్యాణ్ భరోసా!

'గిరిజనులతో మాటామంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు

- ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది
- 'డోలి మోత'లతో ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామం నుంచి మర్పు మొదలు కావాలి
- మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికే 460 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాం
- సుమారు 3 వేల గ్రామాలకు తాగు నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు




అమరావతి: ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పాడేరు నియోజకవర్గం, నందిగరువు గ్రామంలో శనివారం నిర్వహించిన 'గిరిజనులతో మాటామంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'డోలి మోత'లతో ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామం నుంచి మర్పు మొదలు కావాలని, అందుకే ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'సమస్యలు ఏవైనా రాత్రికి రాత్రే పరిష్కారం కావు, కానీ పరిష్కరించాలనే సంకల్పం మాకుంది. ప్రధానమంత్రి నిధులతోనే ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణం సాధ్యమైంది. గత ప్రభుత్వంలో ఈ నిధులు ఏమయ్యాయో మీరు నాయకులను నిలదీయాలి. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికే 460 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాం, పార్టీలతో సంబంధం లేకుండా నిధులు కేటాయిస్తున్నాం. నాయకులకు ఈ ప్రాంతాలకు రావాలంటేనే భయం, కానీ నేను ప్రజల కోసం పనిచేసే వ్యక్తిని కాబట్టి

## యుద్ధ ప్రభావం ప్రజలపై పడకుండా మేం చూస్తుంటే, కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది: మోదీ తీవ్ర ఆగ్రహం

జాతీయ ప్రయోజనాల విషయంలో
ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.
నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదు
అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు
అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు.
ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంద



## సీఎం రేవంత్ రెడ్డిని ఇఫ్తార్ విందుకు ఆహ్వానించిన మంత్రి అజారుద్దీన్

## గ్యాస్ కష్టాలు: పనుల్లేక సొంతూళ్లకు వలస కూలీలు



తిరువనంతపురం: దేశాన్ని ఎల్పీజీ కొరత అతలాకుతలం చేస్తోంది. వంట గ్యాస్ దొరక్క వందలాది హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడటంతో మరో పెను సంక్షోభం తెరపైకి వచ్చింది. ఉపాధి కోల్పోయిన వేలాది మంది వలస కార్మికులు తమ సొంత రాష్ట్రాలకు తిరుగుపయనం అవుతున్నారు. కేరళలోని హోటల్ రంగం ప్రధానంగా పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలపైనే ఆధారపడి నడుస్తోంది. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం, మరోవైపు రంజాన్ పండుగ

## మోదీపై మరోసారి ప్రేమ కురిపించిన ట్రంప్.. త్వరలో భారత్‌కు వస్తానని సందేశం



ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. భారత్, భారత ప్రజల పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ, త్వరలోనే దేశంలో పర్యటించే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపారు. ఇండియా టుడే కాన్క్లేవ్ 2026 సదస్సులో ట్రంప్ పంపిన ఈ సందేశాన్ని అమెరికాకు చెందిన మితవాద కార్యకర్త,

## అప్పర్ కృష్ణా ప్రాజెక్టు ఏపీపై పోరుకు కర్ణాటక వ్యూహం



- ★ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాలను బలంగా ఎదుర్కొనేందుకు కర్ణాటక సిద్ధమైంది
- ★ మార్చి 17న ఢిల్లీలో రాష్ట్ర ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు
- ★ శనివారం బాగల్‌కోట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.
- ★ "ట్రైబ్యునల్ ఆదేశాల మేరకే మాకు కేటాయించిన నీటి వాటాను వినియోగించుకోవడానికి ప్రాజెక్టు పనులు చేస్తున్నాం

# బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

- గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష
- రాష్ట్రంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశాం
- రాష్ట్రంలో గ్యాస్ సరఫరాను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు
- గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు



హైదరాబాద్, : గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అయితే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత ఇబ్బంది ఉన్నట్లు వెల్లడించారు. ఇవాళ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 811 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా

## ఏపీలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి



- తాడేపల్లిలో లక్ష్మీపార్వతి మీడియా సమావేశంలో మాట్లాడారు
- కూటమి అధికారంలోకి వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి
- మహిళలపై ఎమ్మెల్యేలే అత్యాచారాలు చేస్తున్నారని ఆమె అన్నారు

## అమరావతి గ్రామాల్లో సౌకర్యాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన



రాజధాని గ్రామాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు

గ్రామస్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి

ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో సుమారు 30,000 మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు

## ఫలించిన దౌత్యం.. హోర్ముజ్ దాటనున్న మరిన్ని భారత ట్యాంకర్లు



భారత నౌకలకు త్వరలోనే సురక్షిత మార్గం లభిస్తుందని ఇరాన్ రాయబారి మహ్మద్ ఫతాలీ శుక్రవారం సూచించారు ఈ నౌకల భద్రతను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నిశితంగా పర్యవేక్షిస్తోంది

## గ్యాస్ సరఫరా, వినియోగంపై పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు



గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే

ఇప్పటికే 88 శాతం మంది వినియోగదారులు ఓటీపీ ద్వారా సిలిండర్లు తీసుకుంటున్నారు

ఆసుపత్రులు, హాస్టళ్లు, గృహ అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు

# ఫలించిన దౌత్యం..
## హార్ముజ్ దాటనున్న మరిన్ని భారత ట్యాంకర్లు

ఢిల్లీ: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నడుమ హార్ముజ్ జలసంధిలో భారత నౌకలకు మార్గం సుగమమైంది. ఇప్పటికే రెండు ఎల్పీజీ నౌకలు ఈ ప్రాంతాన్ని సురక్షితంగా దాటిన నేపథ్యంలో, మరిన్ని భారత ట్యాంకర్లు ఈ కీలక జలమార్గాన్ని దాటేందుకు సిద్ధంగా ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు శనివారం తెలిపాయి. భారత నౌకలకు సురక్షిత మార్గాన్ని కల్పిస్తామని ఇరాన్ హామీ ఇవ్వడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మధ్య జరిగిన ఉన్నత స్థాయి చర్చల ఫలితంగా రవాణాకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ రంగ సంస్థ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 'శివాలిక్', 'నందా దేవి' అనే రెండు చమురు ట్యాంకర్లు ఇప్పటికే భారత్‌కు బయల్దేరాయి. మరో రెండు రోజుల్లో ఇవి ముంబై లేదా కాండ్లా పోర్టుకు చేరుకునే అవకాశం ఉంది. 'శివాలిక్' నౌకకు భారత నౌకాదళం భద్రత కల్పిస్తోంది. 'నందా దేవి' నౌక 46,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో వస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) మార్చి 12 నాటి సమాచారం ప్రకారం, పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో మొత్తం 28 భారత నౌకలు ఉన్నాయి. వీటిలో 778 మంది భారత సిబ్బంది ఉన్నారు. ఈ నౌకల్లో సుమారు 2.15 లక్షల టన్నుల ఎల్ఎన్జీ, 4.15 లక్షల టన్నుల ఎల్పీజీ, 17.5 లక్షల టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకల భద్రతను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నిశితంగా పర్యవేక్షిస్తోంది. ప్రపంచంలోని చమురు, గ్యాస్ ఎగుమతుల్లో 20 శాతం హార్ముజ్ జలసంధి గుండానే జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతాయి. భారత నౌకలకు త్వరలోనే సురక్షిత మార్గం లభిస్తుందని ఇరాన్ రాయబారి మహ్మద్ ఫతాలీ శుక్రవారం సూచించిన సంగతి తెలిసిందే.

## గ్యాస్ కష్టాలు: పనుల్లేక సొంతూళ్లకు వలస కూలీలు

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం, మరోవైపు రంజాన్ పండుగ దగ్గరపడుతుండటంతో వీరంతా ముందస్తుగానే ఇళ్లకు తరలి వెళుతున్నారు. సాధారణంగా ఎన్నికల సమయానికి వారం ముందు వెళ్లే వీరు, ఇప్పుడు గ్యాస్ కొరత వల్ల హోటళ్లు మూతపడటంతో పనులు లేక ముందుగానే సొంతూళ్లకు తరలివెళ్లిపోతున్నారు. 'ఎల్పీజీ సంక్షోభం మధ్య చిన్న తరహా హోటల్ యజమానులు తమ సిబ్బందిని కాపాడుకోలేకపోతున్నారు. ఒక్కసారి వీరు తమ గ్రామాలకు వెళ్తే మళ్లీ రెండు మూడు నెలల వరకు తిరిగి రారు. ఇది కేరళలోని అన్ని రంగాలపై ప్రభావం చూపుతుంది' అని కేరళ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. జయపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. కేరళలోని వలస కార్మికులలో సుమారు 50 శాతం మంది ఎన్నికలు జరగబోయే బెన్గాల్, అస్సాం ప్రాంతాల వారేనని గణాంకాలు చెబుతున్నాయి. కొందరు యజమానులు గ్యాస్‌కు బదులు ఇతర ఇంధనాలను వాడుతూ పనివారిని ఆపే ప్రయత్నం చేస్తున్నా, పరిస్థితులు ఆశాజనకంగా లేవు. తిరువనంతపురంలోని ప్రముఖ మాల్స్‌కు సిబ్బందిని సరఫరా చేసే ఏజెన్సీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గతంలో 25 మంది పనిచేసే చోట ఇప్పుడు కేవలం ఐదుగురు మాత్రమే మిగిలారు. ప్రస్తుతానికి స్థానిక మహిళలతో పనులు కానిస్తున్నా, వలస కూలీలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. గ్యాస్ సమస్య త్వరగా పరిష్కారం అయితేనే కేరళ ఆతిథ్య రంగం తిరిగి కోలుకునే అవకాశం ఉంది.

## మోదీపై మరోసారి ప్రేమ కురిపించిన ట్రంప్..
## త్వరలో భారత్‌కు వస్తానని సందేశం

మొదటి పేజీ తరువాయి

ఇండియా టుడే కాన్‌క్లేవ్ 2026 సదస్సులో ట్రంప్ పంపిన ఈ సందేశాన్ని అమెరికాకు చెందిన మితవాద కార్యకర్త, ట్రంప్ విధేయురాలు లారా లూమర్ చదివి వినిపించారు. ఈ సదస్సులో పాల్గొన్న లారా లూమర్, తాను వేదికపైకి రావడానికి సుమారు గంట ముందు అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని సభికులకు తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ చెప్పిన మాటలను ఆమె యథాతథంగా వివరించారు. "నాకు ఇండియా అంటే చాలా ఇష్టం. నేను మోదీని ఎంతగానో ఇష్టపడతానని దయచేసి వారికి తెలియజేయండి. ప్రధాని మోదీ ఒక అద్భుతమైన నాయకుడు, నా మంచి స్నేహితుడు. త్వరలోనే మరో పర్యటన కోసం నేను కచ్చితంగా భారత్‌కు వస్తానని భారత ప్రజలకు చెప్పండి" అని ట్రంప్ తనతో అన్నట్లు లూమర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ రాజకీయాలపై చర్చ జరుగుతున్న ఈ సదస్సులో లూమర్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ట్రంప్, మోదీ మధ్య ఉన్న బలమైన స్నేహబంధాన్ని ఈ సందేశం మరోసారి స్పష్టం చేసింది. గతంలో అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ మధ్య ఉన్న స్నేహం ప్రపంచవ్యాప్తంగా పలుమార్లు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా 2020లో ట్రంప్ భారత పర్యటన సందర్భంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో లక్షలాది మంది ప్రజల మధ్య నిర్వహించిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమం వారిద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత బంధానికి నిదర్శనంగా నిలిచింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకుంటూ ఇరువురు నేతలు పలు సందర్భాల్లో ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని ఇఫ్తార్ విందుకు
## ఆహ్వానించిన మంత్రి అజారుద్దీన్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో మార్చి 15వ తేదీన ఈ విందును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని కలిసి ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ స్పందిస్తూ, "గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఈ పవిత్ర రంజాన్ మాసంలో మార్చి 15న జరిగే ఇఫ్తార్ విందుకు ఆహ్వానించాను. ఈ పవిత్ర సమయం అందరిలో శాంతి, కృతజ్ఞత, ఐక్యతను తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను," అని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. సూర్యాస్తమయం తర్వాత ఉపవాసాన్ని విరమించే ప్రక్రియనే ఇఫ్తార్ అంటారు. ఈ మాసంలో నాయకులు, ప్రముఖులు మత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే మంత్రి అజారుద్దీన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

## యుద్ధ ప్రభావం ప్రజలపై పడకుండా మేం చూస్తుంటే,
## కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది: మోదీ తీవ్ర ఆగ్రహం

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు. మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు. అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

## గ్యాస్ సరఫరా, వినియోగంపై
## పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, వినియోగానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని, దీనివల్ల బ్లాక్ మార్కెటింగ్‌ను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 88 శాతం మంది వినియోగదారులు ఓటీపీ ద్వారా సిలిండర్లు తీసుకుంటున్నారని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం, గ్యాస్ కంపెనీలు కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. గ్యాస్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు విధించినట్టు తెలిపారు. డబుల్ సిలిండర్ ఉన్న వారికి 32 రోజుల చొప్పున రీఫిల్ బుకింగ్‌పై పరిమితి విధించినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ... ఆసుపత్రులు, హాస్టళ్లు, గృహ అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశీయంగా గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రిఫైనరీలను ఆదేశించిందని, ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకు ఉత్పత్తి మన దేశంలోనే జరుగుతోందని వెల్లడించారు. హోటల్ అసోసియేషన్లతో కూడా చర్చలు జరుపుతున్నామని, వారు బొగ్గుతో నడిచే తందూరి బట్టీల వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారని చెప్పారు. సోలార్ కుకింగ్ విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రధాన ఆలయాల్లో ఇప్పటికే స్టీమ్ కుకింగ్ అమలులో ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో గ్యాస్ ధరలు పెరగకుండా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. సోమవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆర్‌టీజీఎస్ ద్వారా అన్ని బృందాలతో సమావేశమై గ్యాస్ సరఫరా పరిస్థితిని సమీక్షించనున్నారని వెల్లడించారు. అధిక ధరలు వసూలు చేసే హోటళ్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# గ్రామీణ మహిళలు ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ సృష్టికర్తలు కావాలి : మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ వార్తలు దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన 'షీ స్పార్క్ 2026 ' కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) శనివారం పాల్గొని ప్రసంగించారు. ఓ జాతీయ మీడియా సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీ ఐఐటీలో జరిగిన కార్యక్రమంలో తన జీవితం, మంత్రిగా తీసుకున్న కీలక నిర్ణయాలపై నిర్వాహకులు అడిగిన పలు ప్రశ్నలకు తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

ఆదివాసీ కుటుంబం నుంచి ప్రజాసేవలోకి..

ఈ సందర్భంగా సమాజంలో మార్పు తీసుకురావడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ముందుకు సాగుతున్న మహిళా నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన నిర్వాహకులను ఆమె అభినందించారు. వ్యాపారవేత్తలు, పరిశోధకులు, ఐటీ నిపుణులు, రచయితలు, కళాకారులు, పరిపాలనాధికారులు వంటి అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళలు ఈ సమావేశంలో పాల్గొనడం ప్రేరణనిచ్చే విషయమని అన్నారు. ఇలాంటి వేదికలు మహిళల నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. తాను రాజకీయ కుటుంబం నుంచి రాలేదని, ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామానికి చెందిన ఆదివాసీ కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ప్రజాసేవలోకి వచ్చానని మంత్రి గుర్తుచేశారు. ఒకప్పుడు అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన తన జీవితం తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం పెరిగి ప్రధాన ప్రవాహంలోకి వచ్చానని తెలిపారు. విద్య ద్వారా జీవితాన్ని మార్చుకోవచ్చని నమ్మి న్యాయ విద్యను అభ్యసించి న్యాయవాదిగా పనిచేశానని, అనంతరం ప్రజల సేవ కోసం ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. తన జీవిత ప్రయాణాన్ని 'బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు' అని పేర్కొంటూ, ప్రజాస్వామ్యం ద్వారా సాధించే మార్పు శాశ్వతమని మంత్రి సీతక్క అన్నారు. ఒకప్పుడు న్యాయస్థానంలో నిందితురాలిగా నిలిచిన తాను, తర్వాత అదే కోర్టులో న్యాయవాదిగా నిలిచిన సందర్భం తన జీవితాన్నిమలుపు తిప్పిందన్నారు. మహిళలకు పెద్ద స్థాయిలో వ్యాపార అవకాశాలు.. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఇది సాధ్యమైందని ఆమె తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం ద్వారా రాష్ట్రంలో 46 లక్షలకుపైగా మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి సామాజిక-ఆర్థిక మార్పుకు దోహదపడుతున్నారని చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, చిన్న మధ్యతరహా వ్యాపారాలకు రుణాలు, మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ మహిళలను ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి విధానం ద్వారా మహిళలకు పెద్ద స్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. స్వయం సహాయక సంఘాలు బస్సులు నిర్వహించడం, కమ్యూనిటీ క్యాంటీన్లు నడపడం, వరి కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం, పాఠశాల యూనిఫార్మ్‌లు తయారు చేయడం వంటి అనేక రంగాల్లో ముందంజలో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఇందిరా మహిళా శక్తి బజార్'ద్వారా గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను నగర మార్కెట్‌కు నేరుగా విక్రయించే అవకాశాన్ని కల్పించామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు బలపడతాయని, సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క అన్నారు. దేశ అభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములు మాత్రమే కాకుండా మార్పుకు నాయకత్వం వహించే స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ... గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు అవకాశాలు కల్పించేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన ఆదివాసీ అమ్మాయి మంత్రి కాగలిగిందని... సంకల్పం, విద్య, ప్రజాస్వామ్యం ఏ జీవితాన్నైనా మార్చగలదని పేర్కొన్నారు. కార్యక్రమం నిర్వహించిన YourStory సంస్థ స్థాపకురాలు శ్రద్ధా శర్మ, నిర్వాహకులను మంత్రి సీతక్క అభినందించారు. మహిళలు అభివృద్ధిలో భాగస్వాములు మాత్రమే కాకుండా మార్పుకు నాయకులుగా నిలిచే భవిష్యత్తును కలిసి నిర్మిద్దామని ఆమె పిలుపునిచ్చారు.

# బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

మొదటి పేజీ తరువాయి




రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 811 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.3 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో 11 లక్షలు ఉజ్వల పథకం, 28 లక్షలు దీపం పథకం కింద ఉన్నాయని వెల్లడించారు. అదనంగా 7.5 లక్షల కమర్షియల్ కనెక్షన్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నెల రాష్ట్రంలో 58 లక్షల నుంచి 60 లక్షల వరకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని మంత్రి వివరించారు. ఇటీవల కొన్ని రోజులుగా ప్రజల్లో ఆందోళన కారణంగా బుకింగ్స్ రెట్టింపు అవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ సుమారు 2.5 లక్షల గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతున్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా కూడా ఎక్కువగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసినట్లు మంత్రి చెప్పారు. అయితే కమర్షియల్ సిలిండర్ల విషయంలో కొంత కొరత ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో రోజుకు సుమారు 23 వేల కమర్షియల్ సిలిండర్లు అవసరం ఉండగా ప్రస్తుతం 6,200 మాత్రమే సరఫరా చేయగలుగుతున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కమర్షియల్ సిలిండర్ల సరఫరా 20 శాతం పరిమితిలోనే జరుగుతోందని చెప్పారు. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ సప్లయ్ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్యాస్ సరఫరా సంబంధిత ఫిర్యాదుల కోసం 180042500333 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

## ఏపీలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి

తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై జరుగుతున్న దారుణాలపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి మండిపడ్డారు. తాడేపల్లిలో లక్ష్మీపార్వతి మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని చెప్పారు. హహిళలపై ఎమ్మెల్యేలే అత్యాచారాలు చేస్తున్నారని ఆమె అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాంటి వ్యక్తిని టీటీడీ ఛైర్మన్‌గా నియమించారో అందరికీ తెలుసని లక్ష్మీపార్వతి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే మహిళలకు న్యాయం జరిగిందని ఆమె అన్నారు. చంద్రబాబు నాయుడు సిగ్గుమాలిన నాయకుడని ఆమె మండిపడ్డారు. 'రాష్ట్రం అత్యాచారాల ఆంధ్రప్రదేశ్ గా మారిపోయింది. కొందరు ఎమ్మెల్యేలు కూడా మహిళలపై దారుణాలకు పాల్పడటం సిగ్గుచేటు. పాపాలను పంచుకోవటంలో జనసేన కూడా భాగం పంచుకుంటోంది. పోలీసులను పనికిమాలిన వారిగా మార్చేశారు. కిరణ్ రాయల్, అరవ శ్రీధర్, కోనేటి ఆదిమూలం, నసీర్ అహ్మద్, కూన రవికుమార్.. ఇలా చెప్పుకుంటే ఎంతోమంది మహిళలను వేధించారు. దేవుడే లేడన్న చంద్రబాబు సీఎం అయ్యారు. పూజ దీపం దగ్గర సిగరెట్ ముట్టిస్తాడంటూ తన తండ్రి గురించి చెప్పిన పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. ఇలాంటి వారి చేతిలో రాష్ట్రం అధోగతి పాలవుతోంది. మహిళలకు అన్యాయం చేసిన వారు ఏమయ్యారో చరిత్ర చూస్తే తెలుస్తుంది. చంద్రబాబు మహిళలను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారు. ఇప్పుడు మేకతోలు కప్పుకుని స్తోత్రాలు మాట్లాడవద్దు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడి వీడియోలు బయటకు వస్తే ఏం చర్యలు తీసుకున్నారు? ఒక మహిళ స్వయంగా లేఖ రాసినా చంద్రబాబు ఎందుకు పట్టించుకోలేదు? దేవునితో కూడా ఆటలు ఆడుకోవటం సరికాదు. జగన్ హయాంలో దిశ యాప్, దిశా పీఎస్ లు ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పించారు. ఇలాంటి మేలు చేయటం చంద్రబాబు చరిత్రలో లేదు. ప్రజలు ఎంత అసహ్యించుకుంటున్నారో బయటకు వస్తే తెలుస్తుంది. ఆడపిల్లలను స్కూల్‌కి పంపాలన్నా కూడా ఇప్పుడు పేరెంట్స్ భయపడుతున్నారు.


## మాట ఇచ్చాం.. పనులు చేస్తాం..
## గిరిజనులకు పవన్ కల్యాణ్ భరోసా!



మొదటి పేజీ తరువాయి

నాయకులకు ఈ ప్రాంతాలకు రావాలంటేనే భయం, కానీ నేను ప్రజల కోసం పనిచేసే వ్యక్తిని కాబట్టి ఎవరికీ భయపడను. మీ సమస్యలు తెలుసుకోవడానికి ముందుకు వచ్చానని' ఆయన అన్నారు. నందిగరువు గ్రామస్తుల విన్నపం మేరకు కొత్త పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, 1.6 కిలోమీటర్ల మేర నూతన రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామంలో మ్యాజిక్ డ్రైన్లు మంజూరు చేశారు. అలాగే, సుమారు 3 వేల గ్రామాలకు తాగు నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికి కీలకమైన జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## అప్పర్ కృష్ణా ప్రాజెక్టు
## ఏపీపై పోరుకు కర్ణాటక వ్యూహం



ఢిల్లీ: అప్పర్ కృష్ణా జలాల ప్రాజెక్టు (యూకేపీ) మూడో దశ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాలను బలంగా ఎదుర్కొనేందుకు కర్ణాటక సిద్ధమైంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, మార్చి 17న ఢిల్లీలో రాష్ట్ర ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. శనివారం బాగల్‌కోట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అప్పర్ కృష్ణా ప్రాజెక్టు, దానికి సంబంధించిన భూసేకరణను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై కేంద్రం తమ నుంచి వివరణ కోరిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఏపీ వైఖరికి వ్యతిరేకంగా తమ వాదనను ఢిల్లీలో బలంగా వినిపిస్తామని శివకుమార్ స్పష్టం చేశారు. "ట్రైబ్యునల్ ఆదేశాల మేరకే మాకు కేటాయించిన నీటి వాటాను వినియోగించుకోవడానికి ప్రాజెక్టు పనులు చేస్తున్నాం. ఇప్పటికే సుమారు రూ. 26,000 కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతానికి ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచే ఆలోచన లేదు. కేవలం మా వాటా నీటిని వాడుకోవడానికే ప్రయత్నిస్తుంటే, దానికి కూడా ఏపీ అభ్యంతరం చెప్పడం సరికాదు" అని ఆయన అన్నారు. ఇదే సమయంలో, తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటకకు చెందిన సుమారు 30 టీఎంసీల నీరు వృథాగా పోతోందని, ఈ వృథాను అరికట్టేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించేందుకు ఏపీ ప్రభుత్వం సహకరించడం లేదని శివకుమార్ ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై చర్చించి, కేంద్రంపై ఒత్తిడి పెంచే వ్యూహాన్ని ఖరారు చేసేందుకు తాను, మంత్రులు హెచ్.కే. పాటిల్, ఎం.బి. పాటిల్, బోసరాజులతో కలిసి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన వివరించారు. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో ఎంపీలతో ఈ సమావేశం జరగనుంది.

## అమరావతి గ్రామాల్లో సౌకర్యాలపై
## మంత్రి నారాయణ కీలక ప్రకటన

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా రాజధాని గ్రామాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. అమరావతి పరిధిలోని అనంతవరం, నెక్కల్లు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, సీఆర్డీఏ అధికారులతో కలిసి నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి, మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టమైన హామీ ఇచ్చారు. రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గ్రామ కంఠాల బయట ఏ తరహా అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయో, గ్రామాల్లో కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి వివరించారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్టార్మ్ వాటర్ వ్యవస్థ, ఎల్ఈడీ వీధి దీపాలు, నాణ్యమైన సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడతామని... పనులు ప్రారంభించిన ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో సుమారు 30,000 మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాజధాని నిర్మాణ గడువులపై కూడా నారాయణ కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ నాటికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారుల నివాస భవనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే, 2027 జూన్ నాటికి 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, 1,500 కిలోమీటర్ల లేఅవుట్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇక అమరావతికి తలమానికంగా నిలిచే ఐకానిక్ భవనాలు 2028 డిసెంబర్ నాటికి పూర్తవుతాయని వివరించారు. నిన్ననే ఉండవల్లి వద్ద స్టీల్ బ్రిడ్జ్ పనులను పరిశీలించిన మంత్రి, నేడు నేరుగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించడం విశేషం.

## బండి సంజయ్ పాదయాత్రలో... డ్రోన్ తగిలి తేనెటీగల దాడి

హైదరాబాద్: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పాదయాత్ర సందర్భంగా తేనెటీగలు దాడి చేశాయి. 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు చేపట్టిన పాదయాత్రలో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రామడుగు మండలం కోన్‌రావుపేట సమీపంలో పాదయాత్ర దృశ్యాలను చిత్రీకరించేందుకు పలువురు అభిమానులు డ్రోన్ ఎగురవేశారు. అది పక్కనే ఉన్న చెట్టుకు ఉన్న తేనెతుట్టెకు తగిలింది. దీంతో తేనెటీగలు లేచి, పలువురు కార్యకర్తలపై దాడి చేశాయి. తేనెటీగల దాడితో కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారు. తేనెటీగలు నలుగురు కార్యకర్తలపై దాడి చేశాయి. అప్రమత్తమైన బండి సంజయ్, ఆయన సిబ్బంది వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పాదయాత్రకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అనంతరం వైద్యులు బండి సంజయ్‌కి రొటీన్ వైద్య పరీక్షలు చేశారు. ఆ తర్వాత పాదయాత్ర తిరిగి ప్రారంభమైంది. ఈ అంజన్న ఆశీర్వాద యాత్ర కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు 40 కిలోమీటర్లు కొనసాగుతుంది. ఉదయం ప్రారంభమైన ఈ యాత్ర సాయంత్రానికి చేరుకుంటుంది.

## కీలక రంగాల్లో భాగస్వామిగా తెలంగాణ..
## టాంజానియా బృందంతో మంత్రి

హైదరాబాద్: డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, మహిళా సాధికారత, ఎమర్జింగ్ టెక్నాలజీస్, డిజిటల్ గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, కెపాసిటీ బిల్డింగ్, స్కిల్ డెవలప్మెంట్ తదితర కీలక రంగాల్లో టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్ సిద్ధం చేస్తామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టాంజానియా మినిస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ ముద్రిక్ రమదాని సోరాగా నేతృత్వంలోని అత్యున్నత స్థాయి బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యింది. 'తెలంగాణ - టాంజానియా' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సామాజిక, ఆర్థిక సమ్మిళిత వృద్ధికి బలమైన పునాదిగా మారిందన్నారు. ఆ దిశగా తెలంగాణ వేసిన అడుగులు ప్రపంచ పటంలో మన రాష్ట్రానికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేశాయన్నారు. ఇదే స్ఫూర్తితో డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారం, మెంటార్ షిప్, నైపుణ్య మార్పిడి అందిస్తామన్నారు. అక్కడ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు గల సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. 'మీ సేవ' ద్వారా డోర్ స్టెప్ సిటిజన్ సర్వీసెస్ డెలివరీ, 'వీ హబ్' మార్గ నిర్దేశంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం తదితర అంశాల్లో ఒక 'నాలెడ్జ్ పార్ట్నర్'గా వ్యవహరిస్తామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ పై మార్గనిర్దేశం చేస్తామన్నారు. బ్లూ ఎకానమీ, టూరిజంలో టాంజానియా అవలంభిస్తోన్న బెస్ట్ ప్రాక్టీసెస్ పై అధ్యయనం చేసి... తెలంగాణలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 'డిజిటల్ ఎకానమీగా మారాలన్న మా లక్ష్య సాధనలో తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాల వ్యూహాత్మక భాగస్వామ్యం ఆవశ్యకం. ఐటీ, హెల్త్ కేర్, మెడికల్ టూరిజం, డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో సాధించిన ప్రగతి, చేపట్టిన సంస్కరణలు మాకు స్ఫూర్తిదాయకం. అందుకే.. తెలంగాణతో కలిసి పని చేసేందుకు త్వరలోనే ఎంవోయూ కుదుర్చుకుంటాం' అని టాంజానియా మంత్రి ముద్రిక్ రమదాని సోరాగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టాంజానియా కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి ఫాత్మా మబ్రూక్ ఖమిస్, జాంజిబార్ ఐసీటీ అథారిటీ సీఈవో శుకూరు అవాద్ సులేమాన్, ప్రెసిడెంట్స్ డెలివరీ బ్యూరో - హెడ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్ మెంట్స్ జాన్ మహుండి తదితరులు పాల్గొన్నారు.

# ఎండల తీవ్రత దృష్ట్యా ఒంటిపూట బడులు

# పదో తరగతి పరీక్షలకు హోళగుందలో పూర్తి ఏర్పాట్లు






**- మార్చి 16 నుంచి అన్ని పాఠశాలల్లో మారిన బడి సమయాలు**

**- మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 734 మంది విద్యార్థులు పరీక్షలు**

**- పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు**

**- విద్యార్థులకు తాగునీరు, మౌలిక వసతులు సిద్ధం**

**హోళగుంద, మార్చి 15 (స్ఫూర్తి పత్రిక):** వేసవిలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో మార్చి 16వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని నిర్ణయించినట్లు మండల విద్యాధికారులు సుధారాణి, కబీర్ సాబ్ తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక పాఠశాలలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పాఠశాలల్లో ఉన్నత పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ఇదే సమయంలో సోమవారం ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారులు వెల్లడించారు. పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హోళగుంద మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎ సెంటర్‌లో 304 మంది విద్యార్థులు, బి సెంటర్‌లో 291 మంది విద్యార్థులు, అలాగే కేజీబీవీ సెంటర్‌లో 139 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొత్తం 734 మంది విద్యార్థులు ఈసారి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల కోసం తగిన సంఖ్యలో డెస్కులు, బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి మౌలిక వసతులను కూడా సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు క్రమబద్ధంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణం నెలకొనేలా ముందస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలులో ఉండనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ తీసుకుని పరీక్ష ప్రారంభానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారులు ఆకాంక్షించారు.

# పన్నులు సకాలంలో చెల్లిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యం

**:- ప్రజలకు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌పై అవగాహన**

**:- ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించాలని సూచన**

**:- పంచాయతీ కార్యాలయంలో కూడా చెల్లింపు సౌకర్యం**

**:- గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం**

**హోళగుంద, మార్చి 15 (స్ఫూర్తి పత్రిక):** గ్రామాల అభివృద్ధి ప్రజల సహకారంతోనే సాధ్యమని, గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు తమ ఇల్లు, కొళాయి, దుకాణాలు మరియు ఇతర పన్నులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి రాజశేఖర్ గౌడ్ సూచించారు. ఆదివారం గ్రామ ప్రజలకు ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన "స్వర్ణ పంచాయతీ పోర్టల్" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో పన్నుల వసూళ్లను సులభతరం చేయడం మరియు పారదర్శకత పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పోర్టల్‌ను ప్రారంభించిందని తెలిపారు. గతంలో బిల్ కలెక్టర్లు ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేసే విధానం ఉండేదని, ప్రస్తుతం డిజిటల్ విధానంలో ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా తమ పన్నులను చెల్లించే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఇంటి పన్ను, కొళాయి పన్ను, దుకాణాల పన్ను తదితర గ్రామపంచాయతీకి సంబంధించిన అన్ని రకాల పన్నులను సులభంగా చెల్లించవచ్చని తెలిపారు. స్మార్ట్ ఫోన్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం లేని వారు పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించి సిబ్బంది సహాయంతో తమ పన్నులను చెల్లించుకోవచ్చని చెప్పారు. పన్నులు చెల్లించిన వెంటనే స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ రసీదు పొందే విధానం కూడా అందుబాటులో ఉందని వివరించారు. గ్రామాలలో రహదారులు, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు, మౌలిక వసతులు మెరుగుపరచడానికి పన్నుల వసూళ్లు ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ బాధ్యతగా భావించి పన్నులు సకాలంలో చెల్లిస్తే గ్రామాభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయవచ్చని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు ముందుకు వచ్చి పంచాయతీకి సహకరించాలని, పన్నులు చెల్లించడం ద్వారా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పంచాయతీ అభివృద్ధి అధికారి రాజశేఖర్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# దేవరగట్టులో భక్తుల రద్దీ...

# మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు





**- ఆదివారం సందర్భంగా ఘనంగా అభిషేకాలు, అర్చనలు**

**- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు**

**- ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం**


**- భక్తులకు అన్నదాన కార్యక్రమం**

**హోళగుంద, మార్చి 15 (స్ఫూర్తి పత్రిక):** హోళగుంద మండల పరిధిలో ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిఁచారు. ఆలయ అర్చకులు గిరి స్వామి, మనోహర్ స్వామిలు మాళ మల్లేశ్వర స్వామివారికి సంప్రదాయ పద్ధతిలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బిల్వార్చన, బండారు అర్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకు పూజలు నిర్వహించి భక్తుల కోరికలు తీర్చాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. స్వామివారి నామస్మరణతో ఆలయం మారుమోగింది. భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేయించారు. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున దేవరగట్టు చేరుకుని మాళ మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి కృపతో కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని భక్తులు ప్రార్థనలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజన సౌకర్యం కల్పించి సేవలు అందించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని అభినందించారు. ప్రతి ఆదివారం దేవరగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఆలయానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# మోదీదే ఈ శతాబ్ది!?

'ఈ శతాబ్దం నాది'... అని కలం చేతబట్టి మరీ గర్జించాడు మహాకవి శ్రీశ్రీ! సాహిత్య రంగంలో తనకు ఎదురులేదన్న ఆత్మవిశ్వాసంతో ఆయన ఈ సవాలు విసిరారు. ఈ మాటల్లో అతిశయోక్తికానీ, అహంకారం కానీ లేదని ఆయనను బాగా ఎరిగినవారు చెప్పేవారు. ఐదు దశాబ్దాల క్రితం శ్రీశ్రీ విసిరిన సవాలు ఇది! మళ్లీ ఇంత కాలానికి 'ఈ శతాబ్దం నాది' అని రాజకీయ రంగంలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సవాలు విసురుతున్నారు. తనను కలిసిన రాజకీయ ప్రముఖుల వద్ద ప్రధాని ఈ మాటలు అన్నారట! మీ వంటి రాజకీయ నాయకులు మరో యాభై ఏళ్ల వరకు కనిపించరని తనను కలసిన ఒక ముఖ్యుడు అన్నప్పుడు 'పచ్చాస్ సాల్ నహీ... సౌ సాల్ తక్' అంటే, యాభై ఏళ్లు కాదు, వందేళ్ల వరకూ నా లాంటి వాడిని చూడరు అని ప్రధాని మోదీ అన్నారట. దేశ రాజకీయాల్లో తనకు ఉన్న పట్టు గురించి చెప్పడానికి ఆయన ఈ మాట అని ఉంటారు. ఈ మాటల్లో అతిశయోక్తి ఉందో లేదో తెలియదు. నిండైన ఆత్మవిశ్వాసంతో నరేంద్ర మోదీ ఈ మాట అని ఉంటారు. ఎందుకంటే, వర్తమాన రాజకీయాలలో ఆయనను ఢీకొనగల నాయకుడు కనిపించడం లేదు. రాజకీయాల్లో తన ప్రభావం వందేళ్లపాటు ఉంటుందని చెప్పడానికి మాత్రమే ఆయన పరిమితం కావడం లేదు. అందుకు అనుగుణంగా చర్యలు కూడా తీసుకుంటున్నారు. కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. ఈ క్రమంలో రాజకీయాలలో అనేక వ్యూహాత్మక మార్పులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టబోతున్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆయన... మరో రెండు పర్యాయాలు ప్రధానమంత్రిగా ఉండాలని కూడా కోరుకుంటున్నారట! ప్రస్తుతం మోదీ వయసు 75 ఏళ్లకు పైబడింది. మరో రెండు పర్యాయాలు అంటే ఆయన వయసు 90 ఏళ్లకు చేరుకుంటుంది. దేశాన్ని సుదీర్ఘ కాలంపాటు పాలించిన ప్రధానమంత్రిగా చరిత్రలో నిలిచిపోవాలన్నది ఆయన అభిలాష అయివుండవచ్చు. ఆయన ఆకాంక్ష నెరవేరుతుందో లేదో ఇప్పుడే చెప్పలేంగానీ రాజకీయాలలో తనకు ఎదురులేకుండా చేసుకోవడానికి వీలుగా మాత్రం ప్రధానమంత్రి అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందులో భాగంగా ఎప్పటి నుంచో చర్చలో ఉన్న జమిలి ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. 2029లో పార్లమెంటుతోపాటు వీలైనన్ని రాష్ట్రాల శాసనసభలకూ ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదాహరణకు తెలంగాణ విషయమే తీసుకుందాం! తెలంగాణ శాసనసభకు గడువు 2028 డిసెంబరుతో ముగుస్తుంది. అయితే, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాన్ని మరో ఆరు నెలలు పొడిగించి 2029లో ఎన్నికలు నిర్వహించేలా చట్ట సవరణ చేస్తారు. బహుశా ఈ విషయం తెలిసినట్టుగా ఉంది, అందుకే తాను ఆరు నెలలు అదనంగా ముఖ్యమంత్రిగా కొనసాగుతానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆ మధ్య అన్నారు. తమిళనాడు శాసనసభకు వచ్చే నెల ఎన్నికలు జరగబోతున్నాయి. జమిలి ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టబోతున్న చర్యలలో భాగంగా మూడేళ్ల కాలాన్ని పూర్తి చేసుకొనే తమిళనాడు వంటి రాష్ట్రాల శాసనసభలకు గడువు ముగియకపోయినా 2029లోనే ఎన్నికలు జరుపుతారు. మొత్తం మీద దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభలకు 2034లోగా జమిలి ఎన్నికలు నిర్వహించే విధంగా చట్టంలో మార్పులు చేయబోతున్నారు. జమిలి ఎన్నికల కోసం ప్రధాని మోదీ ఎందుకు ఇంతగా పట్టుపడుతున్నారంటే, కారణం లేకపోలేదు. పార్లమెంటుకు జరిగే ఎన్నికల్లో జాతీయ పార్టీలకు కొన్ని అనుకూలతలు ఉంటాయి. ఓటర్లు జాతీయ పార్టీల వైపు కొంత మొగ్గు చూపుతారు. తెలంగాణ విషయమే తీసుకుందాం! ఈ అనుకూలతలను దృష్టిలో పెట్టుకొనే ప్రాంతీయ పార్టీగా ఉన్న తమకు నష్టం జరగకూడదన్న ఉద్దేశంతో 2019లో జరగవలసిన అసెంబ్లీ ఎన్నికలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరు నెలలు ముందుకు జరిపించుకున్నారు. ఫలితంగా 2018లోనే అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. జాతీయ స్థాయి ఎన్నికల్లో జాతీయ పార్టీలకు తప్పనిసరిగా అనుకూలతలు ఉంటాయని చెప్పడానికి 2024లో ?తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. ఆరు నెలల ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా అవతరించగా, బీజేపీకి ఎనిమిది అసెంబ్లీ స్థానాలే లభించాయి. అదే పార్టీ ఆరు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు గెలుచుకోగలిగింది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాలేదు. దీన్నిబట్టి 2029లో జమిలి ఎన్నికలు జరిపితే ప్రధాన పోటీ కాంగ్రెస్--బీజేపీ మధ్యే కేంద్రీకృతమయ్యే అవకాశముంది. ప్రజలు గంపగుత్తగా మొగ్గు చూపితే తప్ప బీఆర్ఎస్ జాతీయ పార్టీలను ఎదుర్కొనే పరిస్థితి ఉండకపోవచ్చు. బహుశా ఈ కారణంగానే తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చి తమది జాతీయ పార్టీ అని కేసీఆర్ ప్రకటించి ఉండవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంతరంగం ప్రాంతీయ పార్టీలకు వ్యతిరేకం. దేశంలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉండకూడదని, జాతీయ పార్టీలు మాత్రమే ఉండాలని మోదీ తలపోస్తుంటారట! ఈ నేపథ్యంలోనే, 'జమిలి ఎన్నికలకు సహకరించండి, మరో రెండు పర్యాయాలు నేనే ప్రధానమంత్రిగా ఉంటా. ఆ తర్వాత కాలం కలసి వస్తే కాంగ్రెస్ అధికారంలోకి రావొచ్చు, బీజేపీ--కాంగ్రెస్ పార్టీలు మాత్రమే మిగులుతాయి' అని ప్రధానమంత్రి తనను కలసిన కాంగ్రెస్ ముఖ్యుల వద్ద కూడా అన్నారట! దక్షిణాది రాష్ట్రాలను మినహాయిస్తే, మిగతా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు బలహీనపడుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ ఒక్కటే బలంగా ఉంది. బిహార్‌లో ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌తో రాజీనామా చేయిస్తున్నందున అక్కడ జేడీయూ కూడా బలహీనపడవచ్చు. ఎన్నికల తర్వాత నితీశ్‌తో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయించాలన్నది ఎన్నికలకు ముందే కుదుర్చుకున్న అవగాహన. వయోభారం, అనారోగ్యం కారణంగా ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవడానికి నితీశ్ కూడా అంగీకరించారు. అయితే, ఈ పరిణామాన్ని దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా జాతీయ రాజకీయాల్లోకి వెళతారని, ఉపప్రధాని అవుతారని ప్రచారం చేశారు. లోకేశ్ ముఖ్యమంత్రి అవుతారని కూడా ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాల్లో వాస్తవం లేదని తేలిపోతోంది. జమిలి ఎన్నికల వల్ల జాతీయ పార్టీలకు కలిగే లాభాలను గుర్తించడం వల్లనే కేసీఆర్ అండ్ కో వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి పెద్దగా బలం లేకపోయినా పొత్తులు పెట్టుకొని కూటమిగా పోటీ చేసి గత ఎన్నికల్లో స్వీప్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే తెలంగాణలో బీజేపీ పటిష్ఠంగా ఉంది. సొంతంగా అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తోంది. ప్రస్తుతానికి బీజేపీతో పోల్చితే బీఆర్ఎస్ బలంగా ఉంది. అయితే ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను అనారోగ్య సమస్యలు వేధిస్తుండటం పార్టీ శ్రేణులను కలవరానికి గురి చేస్తోంది. ఈ కారణంగానే వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపై ఆశలు పెంచుకుంటున్నారు. పొత్తులకు సంబంధించి బీఆర్ఎస్ నుంచి ఎన్ని ప్రతిపాదనలు వస్తున్నప్పటికీ బీజేపీ అగ్రనాయకత్వం మాత్రం గుంభనంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో రాజకీయ సమీకరణలు ఎలా ఉంటాయో వేచి చూడాలి. జమిలి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ పనిలో పనిగా వచ్చే ఎన్నికల నాటికి పార్లమెంటు స్థానాల సంఖ్య పెంచడంతోపాటు మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పించే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నారు. పార్లమెంటు స్థానాల సంఖ్యను 33 శాతం వరకు పెంచబోతున్నారు. జనాభా ప్రాతిపదికన ఈ ప్రతిపాదనను అమలు చేస్తారా లేదా అన్నది ఇంకా స్పష్టం కాలేదు. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచడాన్ని దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలలో జనాభా పెరుగుదల తక్కువగా ఉంటోంది. జనాభా ప్రాతిపదికన అయితే పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందన్న అభిప్రాయం ఉంది. ఇప్పటికే జాతీయ రాజకీయాలను ఉత్తరాది రాష్ట్రాలే ప్రభావితం చేస్తున్నాయి. ఈ కారణంగా జనాభా ప్రాతిపదికను దక్షిణాది రాష్ట్రాలు బలంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు అన్ని రాష్ట్రాలలో 33శాతం వంతున లోక్‌సభ సీట్లను పెంచే అవకాశముంది. అదే జరిగితే తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 స్థానాలు 22 వరకు పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 33కు పెరగవచ్చు. తెలంగాణలో హైదరాబాద్ మహానగరం, దాని చుట్టుపక్కలే జనాభా కేంద్రీకృతం అయింది. అందువల్ల లోక్‌సభ సీట్లు పెరిగితే అవన్నీ హైదరాబాద్‌లోనే ఉంటాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాలను విడగొట్టి సంఖ్య పెంచుతారు. ఇవి కాకుండా వరంగల్, హనుమకొండలో మరొక స్థానం పెరగవచ్చునని చెబుతున్నారు. పార్లమెంటు స్థానాలతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో శాసనసభ స్థానాలను కూడా పెంచబోతున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ రెండు రాష్ట్రాలలో అసెంబ్లీ సీట్లు పెరగబోతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం 119గా ఉన్న అసెంబ్లీ సీట్లు 150 కావొచ్చునని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 175గా ఉన్న సీట్లను 225కు పెంచుతారని అంచనాలు ఉన్నాయి. ఓటర్ల సమగ్ర జాబితా సవరణ తర్వాత జనాభా లెక్కలు పరిగణనలోకి తీసుకొని లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల సంఖ్యను పెంచుతారు. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరగబోతున్నందున అది అధికారంలో ఉన్న పార్టీలకు ఎంతో కొంత లాభిస్తుంది. 2009 ఎన్నికలకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరించారు. ఈ సందర్భంగా చేసిన మ్యాజిక్ వల్లనే వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ ఎన్నికల్లో బొటాబొటీ మెజారిటీతో గెలిచారంటారు. అప్పట్లో ప్రతిపక్షమైన తెలుగుదేశం బలంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలను చీలికలు పేలికలు చేయడం ద్వారా ఆ పార్టీ విజయావకాశాలను రాజశేఖరరెడ్డి దెబ్బతీశారని అంటారు. తెలుగుదేశం బలంగా ఉన్న నియోజకవర్గాలలోని కొన్ని ప్రాంతాలను ఇతర నియోజకవర్గాలలో కలిపారు. ఇప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు కూడా ఈ దిశగానే చర్యలు తీసుకొనే అవకాశం ఉంది. అసెంబ్లీ నియోజకవర్గాలంటూ పెరిగితే తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ మహానగరంలోనే ఎక్కువగా పెరుగుతాయి. ఈ కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కూడా ఇందులో భాగమే. హైదరాబాద్ మహానగర పాలక సంస్థను ఇప్పటికే మూడుగా విభజించారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగి జమిలి ఎన్నికలు జరిగితే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలకు అదనపు ప్రయోజనం చేకూరుతుందనడంలో సందేహం లేదు. ఈ పరిణామాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొనే బీజేపీకి స్నేహ హస్తం చాపాలని బీఆర్ఎస్ తహతహలాడుతోంది. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఉపయోగపడే విధంగా ప్రధాని మోదీ ఎందుకు వ్యవహరిస్తారన్న సందేహం రావడం సహజం. జాతీయ పార్టీలకు చెందిన జాతీయ నాయకులకు లోక్‌సభ సీట్లు గెలుచుకోవడం ముఖ్యం. కేంద్రంలో అధికారంలోకి రావడానికే వారు ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో ఒకటి రెండు రాష్ట్రాలలో అధికారం రాకపోయినా పట్టించుకోరు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే విధంగా వ్యవహరించింది. జమిలి ఎన్నికలు జరిగితే తెలంగాణలోనే కాదు-- దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రయోజనం చేకూరుతుంది. జమిలి ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై కూడా పడుతుంది. అంతంత మాత్రంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు బీజేపీతో పొత్తు పెట్టుకోక తప్పని పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. బీజేపీ ప్రధాన భాగస్వామిగా అవతరిస్తుంది. తమిళనాడునే ఉదాహరణగా తీసుకుందాం. అక్కడ బీజేపీ బలం అంతంత మాత్రమే. అయితే అంతో ఇంతో బలంగా ఉన్న అన్నాడీఎంకే అక్కడ బీజేపీకి ఉపగ్రహంగా మారిపోయింది. కూటమిపై బీజేపీ పెత్తనమే నడుస్తోంది. తెలంగాణలో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నప్పటికీ బీజేపీ ఆధిపత్యమే కొనసాగుతుంది. సీట్ల పంపిణీలో కూడా ఈ ఆధిపత్యం కొనసాగుతుంది. ఇన్ని రకాల ప్రయోజనాలు ఉన్నందునే ప్రధాని మోదీ జమిలి ఎన్నికల పట్ల అంత ఆసక్తి చూపుతున్నారు.


# హైదరాబాద్ సంస్థాన సమరయోధుడు



'వందేహం, మదురుం, శాంతం కాషాయాంబర శోభితం స్వాతంత్ర్యసరోల్లాసం రామానం దాఖ నాయకం' అని కళాప్రపూర్ణ డాక్టర్ దాశరథి అన్నారు. ఆయన చెప్పినట్టు.. హైదరాబాద్ స్టేట్ ప్రజలకు రాచరికం నుంచి విలీనం విముక్తి కలిగించిన వ్యక్తి స్వామి రామానంద తీర్థ.బ్రిటిష్ ప్రభుత్వం 1947, ఆగస్టు 15న భారతదేశానికి స్వాతం త్ర్యం ప్రకటించింది. అయితే, హైదరాబాద్ సంస్థానం మాత్రం భారతదేశంలో కలవడానికి నిరాకరించింది. అప్పుడు హైదరాబాద్ సంస్థానాన్ని అసఫ్ జాహీ వంశపు 7వ రాజైన 'మీర్ ఉస్మాన్ అలీఖాన్' పరిపాలిస్తున్న రోజులు. యావత్ భారతంలో తమ అధికారాన్ని వదులుకొని బ్రిటిష్ ప్రభుత్వం నిష్క్రమిస్తుండగా,అఖండ దేశంలోని చిన్న భాగంలో ఫ్యూడల్ నిరంకుశ పాలన ఉండటం చూడలేమని స్వామి రామానంద తీర్థ హెచ్చరించారు. అంతేకాదు, 1946, జూలై 3న 'భారతదేశంలో రాజకీయ విప్లవం వస్తున్న తరుణంలో హైదరాబాద్ సంస్థానం దీని నుంచి తప్పుకోజాలదు' అంటూ ప్రభుత్వానికి ధిక్కార స్వరం వినిపించారు. స్వామిజీ ఇచ్చిన ఈ నినాదానికి ప్రభావితులైన అనేకమంది యువతీయువకులు 'వందేమాతరం' అంటూ హైదరాబాద్ సంస్థాన విలీన/ విమోచన సంగ్రామంలో దూకారు.సంస్థానంలో నానాటికీ విషమించిపోతున్న పరిస్థితుల నుంచి కవులు, కళాకారులు, సామాన్యులు, మహిళలు, సమస్త ప్రజలకు విముక్తి కలిగించే ఏకైక ఆశాదీపం స్వామి రామానంద తీర్థ. ఆయన శిష్యరికంలో జాతీయ ఉద్యమ ప్రభావం వల్ల మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో పాటు ఇతర ప్రముఖులు 'వందేమాతరం' అంటూ నినదించారు. ఈ ఉద్యమం ఔరంగాబాద్, వరంగల్, గుల్బర్గా, నాందేడ్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ మార్మోగింది. సంస్థానంలో ప్రతి తాలూకాలో, పట్టణంలో సత్యాగ్రహాలు పుంజుకున్నాయి. జాతీయ పతాకం ఎగురవేసినందుకు పద్మజానాయుడిని అరెస్టు చేశారు.దేశభక్తుడు పండిట్ నరేంద్ర, బూర్గుల రామకృష్ణారావు, జి.రామాచారి, గణపతిరావు, జ్ఞానకుమారి హెగ్డే, వందేమాతరం రామచంద్రరావు, కాటం లక్ష్మీనారాయణ, వట్టికోట ఆళ్వారు, బిర్దీచంద్ చౌదరీ, జీఎస్ మెల్కొటే, కాళోజీ నారాయణరావు, ఎం.ఎస్ రాజలింగం, దామోదర్ పాంగ్రేకర్, డి.బిందూ, జమలాపురం కేశవరావు, కొండా లక్ష్మణ్‌బాపూజీ లాంటి అనేకమంది నాయకులను జైళ్లలో బంధించారు. 1947 ఆగస్టు 7న త్రివర్ణ పతాకాన్ని చేతబూని, 'ఇండియా యూనియన్‌లో హైదరాబాద్ కలవాల'ంటూ సుల్తాన్ బజార్‌లో సత్యాగ్రహం ప్రారంభించడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి వరంగల్ జైలుకు పంపారు. సుప్రసిద్ధ కవి దాశరథి , ఇటిక్యాల మధుసూదన్‌రావు లాంటివారితో జైళ్లను నింపేశారు.ఈ నేపథ్యంలో స్వామిజీ ఢిల్లీకి వెళ్లి సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్, నెహ్రూలను కలిశారు. హైదరాబాద్ సంస్థాన స్థితిగతులను, ఖాసీం రజ్వీ జరుపుతున్న దురాగతాలను వారిముందు ఏకరువు పెట్టారు. రజాకార్ల నిషేధానికి శాంతిభద్రతల దృష్ట్యా బొల్లారంలో భారత సైన్యాన్ని దించుతామని 1948 ఆగస్టు 31న అప్పటి ఇండియా గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి తెలిపారు.1948 సెప్టెంబర్ 13 తెల్లవారుజామున భారత ప్రభుత్వ సైన్యాలు హైదరాబాద్ సంస్థానంలో ప్రవేశించాయి. కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మహారాజా, రాజేందర్ సింహాబీ నేతృత్వంలో భారత సైన్యం షోలాపూర్ నుంచి, రెండవ దళం విజయవాడ నుంచి మూడవ దళం అహ్మద్‌నగర్ నుంచి మూకుమ్మడిగా చుట్టుముట్టడంతో హైదరాబాద్ స్టేట్ ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.ఈ నేపథ్యంలో సుల్తాన్‌బజార్‌లో తన నివాసం వద్ద ప్రజలను ఉద్దేశించి స్వామిజీ ప్రసంగించారు. 'ఇది చరిత్రాత్మక పోరాటం, చెప్పలేని బాధలను అనుభవించిన మనం ఎన్నో అగ్ని పరీక్షలను ఎదుర్కొని ఘన విజయం సాధించాం. ఈ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వేలాదిమంది ప్రజలకు కార్యకర్తలకు, కర్షకులకు, కార్మికులకు, విద్యార్థులకు, మహిళామణులకు ఇదే నా అశ్రుతర్పణం' అని భావోద్వేగానికి గురయ్యారు.1948, సెప్టెంబర్ 17న నిజాం నవాబ్ హైదరాబాద్ రేడియో స్టేషన్ నుంచి ప్రసంగిస్తూ భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం బేషరతుగా విలీనమైందని ప్రకటించారు. 1972 జనవరి 22న స్వామిజీ శివైక్యం చెందారు. ఆ తర్వాత ఆయన అనుంగు శిష్యుడు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు స్వామిజీ సంస్మరణార్థం 'స్వామి రామానంద తీర్థ మెమోరియల్' సంస్థను బేగంపేటలో స్థాపించారు. ఇక్కడే 'స్వామిజీ సమాధి' ఉండటం గమనార్హం.


# పంజరంలో చిలుక

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు కావడంతో మద్యం పాలసీ కేసులో ఒక అంకం పూర్తయింది. బెయిల్‌పై వాదనల సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కేంద్ర దర్యాప్తు సంస్థలకు, ముఖ్యంగా సీబీఐకి చెంపపెట్టు లాంటివని చెప్పాలి. 'బెయిల్ ఇవ్వడం సర్వదా వాంఛనీయం. కానీ, జైలు అనేది అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే వర్తింపజేయాలి. పంజరంలో ఉన్న పెంపుడు చిలకలా ప్రవర్తించవద్దు.ఆ ముద్రను చెరిపేసుకోవాల్సిన బాధ్యత సీబీఐ మీదే ఉన్నద'ని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడటమే అందుకు కారణం. ఈ మందలింపుల నేపథ్యంలో



సీబీఐ ఏమైనా నేర్చుకుంటుందా? అనేది సందేహాస్పదమే. ఎందుకంటే, పెంపుడు చిలుక పంజరం నుంచి తనంతట తానుగా బయటకు వచ్చి స్వేచ్ఛగా ఎగరలేదు. అది ఎగరాలంటే దాన్ని పంజరంలో బంధించినవాళ్లు మొదట మారాలి. అప్పుడే బంధనాలను తెంపుకొని తనదైన వాస్తవ కర్తవ్యం దిశగా చిలుక ఎగురగలుగుతుంది.ఒకప్పుడు జాతీయ దర్యాప్తు సంస్థలంటే వెన్నులో వణుకు పుట్టేది. అవి రంగంలోకి దిగాయంటే నేరస్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. ఎందుకంటే, ఎలాంటి లాలూచీ లేకుండా, రాజీపడకుండా అవి దర్యాప్తు జరుపుతాయని గట్టి నమ్మకం. ఇదంతా గత చరిత్ర. రానురాను వాటి పరిస్థితి దిగజారుతూ వస్తున్నది. ఈ దిగజారుడు కాంగ్రెస్ హయాంలోనే మొదలైంది. సుప్రీంకోర్టు ప్రస్తావించినట్టుగా సుకుమారమైన చిలుకలా కాకుండా, మెడలో గొలుసు ఉన్న పెంపుడు కుక్కలా వ్యవహరించేవని కేంద్ర దర్యాప్తు సంస్థలు అప్పట్లోనే తీవ్రమైన విమర్శలు ఎదుర్కొన్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించడం వల్ల వాటి ప్రతిష్ట కొంతమేరకు మసకబారగా.. బీజేపీ నేతృత్వంలోని మోదీ సర్కార్ ఇష్టారాజ్యంగా ఉపయోగిస్తున్న తీరుతో అది మరింతగా భ్రష్టుపట్టింది. అన్ని కేసులు అదే తరహాలో జరుగుతున్నాయని చెప్పలేం కానీ, రాజకీయ కేసుల విషయంలో మాత్రం దర్యాప్తు సంస్థల తీరు వివాదాస్పదమవుతూనే ఉన్నది. ఇది ఎవరూ కాదనలేని వాస్తవం. సుప్రీంకోర్టు అక్షింతలతో ఈ విషయం మరో మారు స్పష్టమైంది.ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సీబీఐ వ్యవహరించిన తీరు మొదటినుంచీ సందేహాస్పదమే. నెలల తరబడి ఈడీ కేసు నడుస్తుంటే చూస్తూ కూర్చున్న సీబీఐ.. ఆ కేసులో బెయిల్ లభించగానే ఉన్నపళంగా ఆయనపై కేసు దాఖలు చేయడం గమనార్హం. విపక్ష నేతలపై సీబీఐ, ఈడీలను ప్రయోగించడం, వారు బీజేపీకి వత్తాసు పలకగానే కేసుల నుంచి విముక్తి కల్పించడం ఈ మధ్య పరిపాటిగా మారింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ఉదంతం అందుకు చక్కటి ఉదాహరణ.సుప్రీం వ్యాఖ్యల తర్వాతైనా దర్యాప్తు సంస్థల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, నిగ్గుతేలే కేసుల సంఖ్య కూడా పెరగాలి. అందుకు మొదటగా దర్యాప్తు సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించాలి. అలా జరగాలంటే ముందుగా వాటిని కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో నుంచి బయటపడేయాలి. ఆమూలాగ్రం పారదర్శకత తేవాలి. పూర్తిస్థాయి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. వాటి నియంత్రణను పూర్తిగా పార్లమెంటరీ కమిటీకి అప్పగించాలి. ఇలాంటి విప్లవాత్మక మార్పులు జరిగితే తప్ప కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరు మెరుగుపడదు. అయితే బీజేపీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ హయాంలో అది జరుగుతుందని ఆశించడం అత్యాశే.

## నైట్ షిఫ్ట్‌కు మహిళలను వద్దనలేం: సుప్రీంకోర్టు




నైట్ షిఫ్ట్‌లో పనిచేసే మహిళలను అడ్డుకోలేమని సుప్రీంకోర్టు తెలిపింది. రాత్రి పూట పని చేయకూడదని వాళ్లకు చెప్పలేమని కోర్టు స్పష్టం చేసింది. నైట్ షిఫ్ట్‌ల నుంచి మహిళా డాక్టర్లకు విముక్తి కల్పిస్తూ బెంగాల్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. మహిళలకు మినహాయింపులు అవసరం లేదని, వాళ్లకు కేవలం సమాన అవకాశాలు కావాలని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఘటనపై నమోదు అయిన సుమోటో కేసు విచారణ సమయంలో కోర్టు పేర్కొన్నది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసులో తీర్పునిచ్చింది. జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. మహిళ భద్రత దృష్ట్యా.. మహిళా డాక్టర్లు రాత్రిపూట పనిచేయ వద్దు అని కోర్టులో కేసు దాఖలైంది.రాత్రిపూట పనిచేయవద్దు అని మహిళలకు ఎలా చెబుతాం, వాళ్లకు మినహాయింపులు కాదు, సమాన అవకాశాలు కావాలి, అన్ని పరిస్థితుల్లోనూ పనిచేసేందుకు మహిళా డాక్టర్లు ఆసక్తిగా ఉన్నారని, వాళ్లు కచ్చితంగా అన్ని పరిస్థితుల్లో పనిచేయాలని, బెంగాల్ సర్కారు తమ నిర్ణయాన్ని సరి చేసుకోవాలని, 12 గంటల షిఫ్ట్‌ను దాటేసి మహిళలు పనిచేయరాదు అని చెప్పలేమని, సైనిక దళాల్లో రాత్రి పూట పనిచేసే మహిళలు ఉన్నారని ధర్మాసనం తెలిపింది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం మహిళా డాక్టర్లకు రక్షణ ఇచ్చేందుకు వెనుకాడితే, అప్పుడు కేంద్ర ప్రభుత్వం వాళ్లకు రక్షణ ఇస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు.నైట్ షిఫ్ట్ విషయంలో సవరణ చేస్తూ కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని బెంగాల్ సర్కారు తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు.

### దేవనకొండలో బెల్టు మద్యం బహిరంగ విక్రయం...

# ఎక్సైజ్ శాఖ నిద్రావస్థలోనా?

- రోడ్డు పక్క బంకులు, చిన్న దుకాణాల్లో మద్యం విక్రయాలపై తీవ్ర ఆరోపణలు
- యువత ఆరోగ్యం, గ్రామాల సామాజిక వాతావరణంపై ప్రతికూల ప్రభావం
- అక్రమ విక్రయాలపై చర్యలు ఎక్కడ అని ప్రజల ప్రశ్న
- ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని గ్రామస్తుల డిమాండ్




**దేవనకొండ, మార్చి 15 (స్ఫూర్తి పత్రిక):** దేవనకొండ మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు మద్యం విక్రయం బహిరంగంగా జరుగుతున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు స్థానిక ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నచిన్న దుకాణాలు, రోడ్డు పక్క బంకులు మరియు కిరాణా షాపుల్లోనే మద్యం సీసాలు విక్రయిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.గ్రామాల్లో ఈ విధంగా మద్యం విక్రయం జరుగుతున్న విషయం అందరికీ తెలిసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని ప్రజలు అంటున్నారు. బెల్టు మద్యం విక్రయం ఇప్పుడు రహస్యంగా కాకుండా బహిరంగంగానే జరుగుతోందని పలువురు గ్రామ పెద్దలు చెబుతున్నారు.చౌక ధరలకు అందుబాటులో ఉండటంతో కొంతమంది యువకులు ఈ మద్యం వైపు ఆకర్షితులవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల యువత ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు కూడా పెరుగుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయం పెరగడం వల్ల సామాజిక సమస్యలు కూడా అధికమవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. మద్యం అలవాటు కారణంగా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని గ్రామ పెద్దలు అంటున్నారు.అక్రమ మద్యం తయారీ, నిల్వ, రవాణా మరియు విక్రయాలను అరికట్టడం ఎక్సైజ్ శాఖ బాధ్యత అయినప్పటికీ మండలంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రామాల్లో బహిరంగంగా మద్యం విక్రయం జరుగుతున్నప్పటికీ ఎలాంటి తనిఖీలు జరగడం లేదని వారు ఆరోపిస్తున్నారు.మండల పరిధిలో ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రోడ్డు పక్క బంకులు, చిన్న దుకాణాలను తనిఖీ చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుతం గ్రామాల్లో వినిపిస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి నిజానిజాలు వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


# మన తెలుగు గొప్పతనం



ప్రపంచవ్యాప్తంగా ఉన్న 18 కోట్ల మంది ప్రజలు మాట్లాడే భాష 'తెలుగు'. మన దేశంలో హిందీతర్వాత ఎక్కువగా మాట్లాడే రెండవ భాష కూడా మన తెలుగే. ఈ మధ్య బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ లిపి సదస్సులో కొరియా భాష తర్వాత రెండవ అంతర్జాతీయ లిపిగా తెలుగునే సమర్థించారు. అంత చక్కని అజంత భాష మనది. అమర భావాల అమృత భాష మన తెలుగు నుడి.ఇక తెలుగు నుడి చరిత్ర గురించి చెప్పుకొంటే.. ఇది క్రీస్తుకు ముందు దాదాపు 3000 ఏండ్ల కిందటనే తొలి అడుగులు వేసిన ద్రవిడ భాష అని చెప్పవచ్చు. అంటే, ఆదిమ ద్రవిడ భాషల చరిత్ర క్రీస్తుపూర్వమే కొన్ని శతాబ్దాల ముందున్నది.ప్రపంచంలో అన్ని భాషల కన్నా పాత భాషగా పాత సుమేర్ భాషను ఎక్కువమంది అంగీకరించారు. తర్వాత పాత ఈజిప్ట్, హిబ్రూ, గ్రీకు, పాత చైనా, కొరియా భాషలు పాతవిగా గుర్తించారు. మన తెలుగు ద్రవిడ భాషా కుటుంబానికి చెందినది. సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలు ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినవి. అంటే, ఇండో యూరప్ కుటుంబానికి చెందినవి. మరి మన ద్రవిడ భాషలైన తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, తులు, కొడగు, కుడుక్, గోండి, గదబ మొదలైనవి ద్రవిడ భాష కుటుంబానికి చెందినవి. ఇక కొందరున్నట్టుగా జనని సంస్కృతంబు సకల భాషలకు అన్న మాట తప్పని ఎందరో సాహితీవేత్తల వాదన. నిజమే. తెలుగు, తదితర ద్రవిడ భాషలకు, సంస్కృతానికి సంబంధమే లేదంటారు. ఇక ఇతర భాషలు చూస్తే హిందీ సంస్కృతం, ప్రాకృతం, ఉర్దూ, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, గుజరాతీ, ఒరియా, మరాఠీ, కశ్మీరీ, కొంకణి, నేపాలీ, ఈ భాషలన్నీ ఇండో ఆర్యన్ భాష కుటుంబానికి చెందినవి.ద్రవిడ భాషల్లో మొదటగా విడివడిన భాష తెలుగు. ఆ తర్వాత తమిళం, కన్నడం, మలయాళం విడిపోయాయి. ప్రపంచంలో దాదాపు 6000 భాషలున్నాయి. వాటిలో సొంత లిపి కలిగి ఉన్న భాషలు దాదాపు 400 లోపు. భారతీయ భాషా కుటుంబాల్లో ముఖ్యమైనవి రెండు భాషా కుటుంబాలు. ఒకటి, ఇండో ఆర్యన్ భాషా కుటుంబం. రెండవది, ద్రవిడ భాషా కుటుంబం. ఇండో ఆర్యన్ భాషలకు చెందినవి ఉత్తర భారతీయ భాషలు. వాటిని ఉత్తర భారతీయ ఆర్య భాషలని కూడా అంటారు. ద్రవిడ కుటుంబానికి చెందిన భాషలు దక్షిణ భారతీయ భాషలు%ా% వీటిని ద్రవిడ భాషలంటారు.ప్రపంచంలో ఉన్న భాషల్లో ఎక్కువ ధాతువులు ఉన్న భాష మన తెలుగే. క్రియా ధాతువులు తమిళంలో 450, హిందీలో 350, సంస్కృతంలో 1400 ఉంటాయి. మరి, మన భాషలో ఎన్నో తెలుసా? తెలుగు భాషలో 1800 ధాతువులున్నాయి. అంత గొప్ప భాష మనది. ధాతుక్రియలు అంటే.. 'కోయు, మూయు, వ్రాయు, వచ్చు, పోవు, కూరు, వండు, నేయు, తెచ్చు, ఇచ్చు'.. ఇలా.. ఉదాహరణకు 'చేయు' అనే మూల క్రియనే తీసుకుంటే ఆ మూల ధాతువు నుంచి ఎన్నో పదాలను పుట్టించవచ్చు. అవి.. 'చేత, చేనేత, చేయగల, చేసి, చేసిన, చేయుచున్న, %ా% ఇలా వేల పదాలు పుట్టించుకోవచ్చు. ఈ సౌలభ్యం ఇతర భాషా నుడులలో ఇంతగా లేదు. మన తెలుగు అజంత భాష కాబట్టి, ప్రతి పదం చివర అచ్చు ఉచ్చారణతో మాట అంతమవుతుంది.ఉదాహరణకు 'అందరూ..' దీనిలో చివరి అక్షరం. ఇలాగే అన్ని మాటల చివర అచ్చు ఉచ్చారణతో ఉంటుంది. ఇలాంటి ఉచ్చారణ లాటిన్ ఇటాలియన్ భాషకు కూడా ఉన్నది. అందుకే, ఈ భాష కూడా అజంత భాష కాబట్టి తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అన్నారు.తెలుగు వినడానికి, అనడానికి అందమైన ఒంపు సొంపుల భాష . తేట తేనెల భాష. సంగీతానికి అనువైన భాష. అమృత నుడుల పాలధారలో పంచదార కలిసిన భాష. మన అమ్మ నుడి తెలుగు నుడి. మన భాషలో ఏది పలుకుతామో అదే రాస్తాం. కానీ, కొన్ని భాషల్లో అలా ఉండదు. మచ్చుకు ఇంగ్లీష్ తీసుకున్నట్టయితే 'కామ్ ఇక్కడ ను పలకం, అలాగే బుట్ కావాలి, కానీ బట్ అని పలుకుతారు. తెలుగులో అలా కాదు. ఎన్ని వ్రాలు పలుకుతామో, అన్ని అక్షరాలే చాలు. మచ్చుకు అమ్మ అనే మాట ఉంటే.. అమ్మ రెండు అక్షరాలు. అదే ఇంగ్లీషులో మదర్ అంటే మందంర్=3 వ్రాలు. కానీ ఇంగ్లీష్‌లో ఆరు అక్షరాలు కావాలి. చూశారా మన తెలుగు గొప్పదనం. అందులో ఉన్న సౌందర్యం, సౌలభ్యం. కనుక భాషాపరంగా భారతదేశంలో అన్ని భాషల కన్నా మన తెలుగే గొప్ప. కాబట్టే, కన్నడ ప్రభువైన శ్రీకృష్ణదేవరాయల వారు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్నారు. ఇది నూటికి నూరుపాళ్లు నిజం. ఇతర భాషల వారు మన భాషను గొప్పగా కీర్తిస్తుంటే, మనం మాత్రం తెలుగు వారమై ఉండి, డాలర్ల వ్యామోహంలో పడి పరభాష, పరుల సంస్కృతిలో కూరుకుపోతున్నాం. కన్న తల్లిని 'అమ్మా' అని పిలవడానికి సిగ్గుపడుతున్నాం. అమ్మను 'మమ్మీ' చేసి ఆనందిస్తున్నాం. ఇందుకు నవ్వుకోవాలో, ఏడ్వాలో అర్థం కాని పరిస్థితి.మన ప్రజల కట్టూ బొట్టు ఎలా ఉండేది? ఆంగ్లేయులు ప్రవేశించి వారి భాషను, వారి సంస్కృతిని మనపై రుద్దారు. దీంతో మనకు తెలియకుండానే వాళ్ల సంస్కృతీ సంప్రదాయాలు మన జీవితంలోకి వచ్చి చేరాయి. అంటే ఒక భాష నశిస్తే, ఆ భాష మాట్లాడే ప్రజల సంస్కృతి కూడా నాశనమవుతుంది. అందుకే.. 'ఒక జాతి సంస్కృతిని నాశనం చేయాలంటే, మొదటగా వారి మాతృభాషను నాశనం చేస్తే చాలు' అని 'మెకాలే' అన్నారు.ఇకనైనా మనం ఇతర భాషల్లోని మాటలకు తెలుగులో అందరికీ అర్థమయ్యే మన జనవాడుక అచ్చ తెలుగు మాటలను పొం దిక చేసుకుందాం. అలా చే యరు, ఎందుకంటే వాళ్లకు తెలుగంటే దేశ్యమని, గ్రామ్యమని, హీన భాషని, లేకి భాషగా భావిస్తారు. అందుకే, అనువాదాలన్నీ సంస్కృత మిళితాంధ్ర భాషనే వాడారు. అందుకే, మేధావులంతా, గత మహానుభావులంతా తెలుగును చిన్నచూపు చూసి, వేల్పునుడికి పెద్దపీట వేశారు. ఇలా నేననడం చాలామంది సం స్కృతవాదులకు నాపై చాలా కోపం వస్తుందేమో.. అయినా, నిజాన్ని నిక్కచ్చిగా చెప్పుకోక తప్పదు.సంస్కృతం మనపై రుద్దడం వల్ల మన తెలుగుకు ఈ సంకర గతి పట్టింది. ఇది అందరూ మన స్ఫూర్తిగా అంగీకరించవలసిన నగ్న సత్యం. ఇది మన తెలుగుకున్న పెద్ద ఇబ్బంది. ఇది మనం గ్రహించకపోవడమే మనం చేసే పెద్ద తప్పు.దేవుని గుడిలో ప్రార్థనలు తమిళంలో, సంస్కృతంలోనూ ఉంటాయి. కానీ తెలుగులో ఉండవు. దేవుళ్లకు తమిళం, సంస్కృతం భాషలు అర్థమైనప్పుడు తెలుగు ఎందుకు అర్థం కాదు? మనం తెలుగులో ప్రార్థనలు ఎందుకు చేయకూడదు? ఇలా చెప్పుకొంటూ పోతే అనేక శ్లోకాలు, ప్రార్థన గీతాలు, మేలుకొలుపులు, సుప్రభాతాలు అన్ని అర్థం కాని సంస్కృతంలోనే ఉంటాయి. వాటిని ఎందుకు అచ్చ తెలుగులోకి అనువదించకూడదు? అందరికీ అర్థమయ్యే రీతిలో చేయవచ్చు కదా? ఒకసారి ఈ దిశగా ఎందుకు ఆలోచించకూడదు?అచ్చమైన తెలుగు కోసం ఎందరో మహానుభావులు కృషిచేశారు.

# దాశరథి జీవననాదం

తెలుగు సాహిత్యంలో జీవిత కథలు.. జీవన ప్రయాణాల చరిత్ర నిక్షిప్తాలు కొత్త కాదు. అతడు-ఆమె.. కాశీయాత్ర నుంచి దాశరథి 'జీవనయానం' వరకు సుసంపన్నమైన సాహితీ భాండాగారం తెలుగు జాతిది. దాశరథి రంగాచార్యులు ఆంధ్రదేశపు రాజకీయ, సాంఘిక, సామాజిక చరిత్రతో సమాంతరంగా పయనించి రచనలు చేసిన సాహితీ స్రష్ట. నాడు-నేడు పై అంశాలలో పది నవలలు పేర్కొంటే వాటిలో సగం దాశరథి రచనలే ఉంటాయి. మోదుగు పూలు, చిల్లర దేవుళ్లు వంటివి కొన్ని మాత్రమే.దాశరథి రంగాచార్యకు వేదం తెలుసు, జీవననాదం తెలుసు. అతని సోదరులు దాశరథి కృష్ణమాచార్యులు అక్షరాలతో అగ్నిధారలు కురిపించిన కవి. సినీగేయ రచయితగానూ సుప్రసిద్ధులు. తమ్ముడు దాశరథి రంగాచార్యులు ఆధ్యాత్మిక సాహితీ శిఖరంలా వెలిగారు. తెలుగు సాహిత్యాన్ని అన్ని ప్రక్రియలలో సుసంపన్నం చేశారు. 'పలికెడిది భాగవతమట పలికించెడు వాడు రామభద్రుడని' వినయంగా చెప్పుకొన్న పోతన మాదిరిగా అత్యంత వినయంతో 'నేను నాలుగు వేదాల వచనానువాదం- కేవలం భగవదనుగ్రహంతో (24-1-1998 నాటికి) పూర్తి చేశాను' అన్నారు రంగాచార్యులు. వేదం ఆయన ప్రాణం, జీవననాదం. తెలుగుజాతి (కాదు.. భారతీయ) సంస్కృతి. సంప్రదాయ జీవనాడి ఆధారం.'అన్ని వేదాల్లోనే ఉన్నాయిష' అన్న కన్యాశుల్కం వాక్కు అక్షర సత్యం. దాశరథి రంగాచార్యులు అక్షర నిధులతో రుజువు చేసిన వాస్తవం. 'ఈ మానవ జీవితం %-% సమాజ జీవితం %-% నాగరికత %-% సంస్కృతి అన్నీ వేదం నుంచి అవతరించినవే! జీవననాదం వేదం నుంచి ఆవిర్భవించింది' అని ఆయనే చెప్పుకున్నారు. వేదం మానవజాతికి వెలుగు ప్రసాదించింది. కనువిప్పు కలిగించింది. జీవననాదం వినిపించింది. జీవనాధారం చూపింది. జీవనసారం బోధించింది. దాశరథిగారి అక్షరరమ్యతను, జీవనానుభవాన్ని, జీవన సూత్రాల విస్తరణను ఈ చిన్న వ్యాసంలో వివరించడం సాధ్యం కాదు. ఆయనది సాహితీ వామనుని విశ్వరూప సందర్శనం. సాహిత్యంలో వేదానికి సంబంధించిన అతి సరళమైన వచనంతో వెలువడిన గ్రంథం 'వేదం జీవనాదం'.దాశరథి జ్ఞాన సంపాదన సూత్రం వేదం. ఈ రచనలో ఆయన చరిత్ర, పోరాటాలు, సామాజికంగా 'మనిషి'లో కలిగిన పరిణామాలు, మృత్యు పరిష్వంగనలు వంటి వాటితో పాటు స్త్రీ సాధికారత కోసం ప్రారంభమైన పోరాటాలు ఈనాటివి కావని, నాటి రామాయణ, మహాభారత కాలాల నుంచి ఉన్నాయనేది ఇతిహాసపు రుజువులతో వివరిస్తారు.ఇతిహాసాల చరిత్రలో మహిళా విముక్తి ఉద్యమాల గురించి ఆయన స్థాలీపులాకన్యాయంగా ఉదహరించారు. ఇందుకు ఉదాహరణలుగా- మహిష్మతి నగరాన్ని పరిపాలించిన నిషధుడు, విశ్వామిత్రుడు- మేనక, మమత, బృహస్పతి వృత్తాంతాలను ప్రస్తావిస్తారు. యవనాశ్వుడు అనే ఇక్ష్వాకు వంశరాజు గురించి వివరించే క్రమంలో మగవారి గర్భధారణ గురించి ఆశ్చర్యపోయే అంశాలను అత్యంత సరళంగా, స్పష్టంగా చెప్పారు.



కృత్రిమ సంతానం (టెస్ట్ ట్యూబ్ బేబీ) ఉదంతాన్ని ఐతిహాసిక ఆధారాలతో వివరించిన వైనం దాశరథి వేద విజ్ఞాన పటిమకు నిదర్శనం. ఏ ప్రక్రియ తీసుకున్నా ఆయన తనదైన ముద్రనే వేశారు. అక్షరాలకు భారతీయ ఆత్మతో కూడిన సంప్రదాయాత్మకమైన తాత్వికతనద్దిన ఆధ్యాత్మిక శీలి దాశరథి.దాశరథి రంగాచార్యులు తెలంగాణ స్వాతంత్ర్య పోరాట యోధుడు. కలం వీరుడు. 1928 ఆగస్టు 24న మహబూబ్ నగర్ జిల్లాలోని చిన్న గూడూరులో జన్మించారు. మార్క్సిజం, సంప్రదాయం భిన్న ధ్రువాలు. ఆ రెండింటి లక్ష్యం ఒక్కటే అయినా దారులు వేరని గ్రహించిన దాశరథి నూతన చక్షువులతో సంప్రదాయాన్ని మార్క్సిజం దృక్పథంతో, మార్క్సిజాన్ని మానవతాదృక్పథంతో అనుసృజన చేశారు. ఉద్యమకాలంలో భారత, రామాయణాలను వ్యతిరేకించినా, స్వాతంత్ర్యం సిద్ధించి ఉద్యమాల నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన దృక్పథంలో మార్పు వచ్చింది. నవలలు, కథలు, కవిత్వం, అనువాదాలు, వ్యాస సంకలనాలు వెలువరించారు. వేద సాహిత్యాన్ని, భారత, భాగవత, రామాయణాలను తమదైన శైలిలో రచించారు. ఆయనకు అనేక పురస్కారాలు లభించాయి. 2015 జూన్ 7న తన 86వ ఏట ఆయన మరణించారు. జాషువా అన్నట్టు 'కవియు మరణించె ఒక తార గగనమెక్కె'. ప్రజల నాలుకలపైన, సాహితీ సహృదయులు నిరంతరం స్మరించుకునే చిరస్మరణీయులు దాశరథి రంగాచార్యులు.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com